క్లుప్తంగా

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం



మృతుని కుటుంబ సభ్యులకు నగదు అందిస్తున్న మాజీ సర్పంచ్ బత్తల వెంకట రమణ

కదిరి అర్బన్: గంగన్నగారిపల్లిలో గురువారం చెరువు రాజు అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుని కుటుంబానికి వైఎస్సార్ సీపీ బీసీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా.బత్తల హరిప్రసాద్ రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ మొత్తాన్ని తన తండ్రి మాజీ సర్పంచ్ బత్తల వెంకటరమణ చేతుల మీదుగా మృతుని కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్ బాబా, వేణు, రెడ్డెప్ప, కిష్ట, రామ్మోహన్ పాల్గొన్నారు.

రేపు మొల్లమాంబ విగ్రహావిష్కరణ



మాట్లాడుతున్న కుమ్మర సంఘం కోశాధికారి పోతలయ్య

బత్తలపల్లి: తొలి తెలుగు కవయిత్రి, కుమ్మర ఆడపడుచు మొల్లమాంబ విగ్రహ ఆవిష్కరణ ఈ నెల 14న విజయవాడలో చేపడుతున్నట్లు కుమ్మర సంఘం రాష్ట్ర కోశాధికారి కుమ్మర మదనాపు పోతలయ్య తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏపీ కుమ్మర శాలివాహన రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమానికి మైసూరు మహారాజు యదువీర కృష్ణదత్త చామరాజ వడయార్, రాష్ట్ర మంత్రులు, శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, కుమ్మర సంఘం నాయకులు హాజరవుతారన్నారు. ఈ నెల 14న శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విగ్రహ ప్రతిష్ట జరుగుతుందన్నారు. కుమ్మరులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. కుమ్మర సంఘం జిల్లా నాయకులు వెంకటనారాయణ, రమణ, భానుకోట రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్ సీజ్



వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేస్తున్న అధికారులు

పుట్టపర్తి టౌన్: మున్సిపాలిటీలోని 4వ వార్డు జెండా వేపమాను వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌ను సీజ్ చేసినట్లు కమిషనర్ ప్రహ్లాద గురువారం తెలిపారు. అమృత వాటర్ ప్లాంట్ యజమాని మరుతి పలుచోట్లు వాటర్ ప్లాంట్లు నిర్మించి తక్కువ ధరలకు ప్రజలకు తాగు నీరు అందించేవారు. అయితే ఆ ప్రాంతంలో డయేరియా కేసుతో ప్రజలు ఇతర రోగాల బారిన పడటంతో తాగునీటి నమూనాలను బుక్కపట్నం సబ్ డివిజన్‌లో ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ల్యాబొరేటరీకి పంపారు. నీటి సామర్థ్యం విలువ 6–5 నుంచి 8–5 మధ్యలో ఉండాల్సి ఉండగా.. జెండా వేపమాను వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌లో 5–6 సామర్థ్యం చూపడంతో ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని వాటర్ ప్లాంట్‌ను మున్సిపల్ కమిషనర్ సీజ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం అనుమతులు లేకుండా నీటి సరఫరా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి



సమావేశంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రామగిరి: ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే రామగిరి మండలం పూర్తిగా వెనుకబడింది. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా అధికారులు చూడాలి. మండలాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలి అని ఎంపీపీ మీనుగ నాగమ్మ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా చాలా మంది అర్హులైన వికలాంగులు, డప్పుకళాకారులు, వితంతువులు, వృద్ధులకు పింఛన్లు అందలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కులం, మతం, ప్రాంతం, పార్టీలను చూడకుండా అర్హులందరికీ వలంటీర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేశామన్నారు. అయితే నేడు వైఎస్సార్ సీపీ సానుభూతిపరులంటూ మండలంలో చాలామందికి ఉద్దేశ పూర్వకంగా పింఛన్లు అందించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గంగావతి, జెడ్పీటీసీ సభ్యుడు గోసే నాగార్జున, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులు పాల్గొన్నారు.

ఉలవ సాగుకు వేళాయె

- 80 శాతం రాయితీతో విత్తనాల పంపిణీ
- తక్కువ పెట్టుబడితో మూడు నెలల్లోనే పంట చేతికి
- రైతుకు అదనపు ఆదాయంతో పాటు పశువుల మేత కూడా..



సేద్యం పనులు చేస్తున్న రైతు (ఫైల్)

బత్తలపల్లి: ఖరీఫ్‌లో వేరుశనగ తదితర పంటలు వేయలేకపోయిన, వేసిన పంటలు దెబ్బతిన్న రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధమయ్యారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు ప్రత్యామ్నాయ పంటల్లో ఉలవసాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయాధికారులు అంటున్నారు. ఈ సీజన్‌లో మొదటి పంట తర్వాత వర్షాధారంగా లేదా ఏపంటలూ వేయడానికి అనువుగా లేనప్పుడు ఉలవ సాగు రైతులకెంతో మేలు కలుగజేస్తుంది.

» ఖరీఫ్‌లో వేరుశనగ, కంది, ఆముదం తర్వాత ఏకపంటగానూ, రాగి, జొన్న పంటల్లో సహపంటగానూ ఉలవ సాగుచేయవచ్చు. పంట వడుపుకున్నాక పశువులకు మంచి ఎండుమేతగా ఉపయోగపడుతుంది. బయోమెట్రిక్ విధానం ద్వారా ప్రతి రైతుకూ ఉలవలు 20 కిలోల దాకా పంపిణీ చేస్తారు. ఉలవతో పాటు పెసర, జొన్న, అలసంద పంపిణీ చేస్తారు. ప్రస్తుతానికి ఉలవలు మాత్రమే అందుబాటులో ఉన్నాయి.

సబ్సిడీ విత్తనం కోసం రిజిస్ట్రేషన్ ఇలా..

వర్షాభావ పరిస్థితుల కారణంగా పంట పెట్టని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం 80 శాతం సబ్సిడీపై ఉలవలు, పెసలు, అలసందలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ప్రత్యామ్నాయ విత్తనం కోసం రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. పంట వేసిన తర్వాత కచ్చితంగా ఈ–పంట నమోదు చేయించాలి. 80 శాతం సబ్సిడీ పోను రైతులు చెల్లించవలసిన ధర ఉలవ పది కిలోల బ్యాగుకు రూ.174, పెసలు నాలుగు కిలోల బ్యాగుకు రూ.104, అలసంద పది కిలోల బ్యాగుకు రూ.226 రైతు సేవా కేంద్రాలలో చెల్లించాల్సి ఉంటుంది. అక్టోబర్ 31 వరకు సాగుకు అనుకూలంగా ఉంటుంది.



ప్రత్యామ్నాయ విత్తనాల కింద పంపిణీ చేసిన ఉలవలు

విత్తనశుద్ధి తప్పనిసరి



ఎకరాకు ఎనిమిది కిలోల ఉలవ విత్తనాలు వేసుకోవాలి. చల్లే ముందు కిలో విత్తనానికి ఒక గ్రాము కార్బండైజిమ్‌ను కలిపి విత్తనశుద్ధి చేయాలి. ఎకరాకు నాలుగు కిలోల నత్రజని, పది కిలోల భాస్వరం, ఎనిమిది కిలోల పొటాష్‌నిచ్చే ఎరువులను విత్తేముందు వేసుకోవాలి. అంతర కృషిగా నాటిన నెలలోపు కలుపు నివారణ చేపట్టాలి. పూత పిందె దశలో కాయతొలుచు పురుగు నివారణకు లీటరు నీటికి ఎండోసల్ఫాన్ రెండు మిల్లీలీటర్లు కలిపి పిచికారి చేయాలి. పంటకాలం మాత్రం 85 నుంచి వంద రోజులు మాత్రమే.

– క్రిష్టయ్య, ఏడీఏ, ధర్మవరం

పంటలు సాగయ్యేలా చూడాలి



వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతింది. కరువు మండలాలను ప్రకటించాలి. గతంలో వంద శాతం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందించేవారు. ఇప్పుడు 80 శాతం మాత్రమే ప్రకటించారు. వేరుశనగకు ప్రత్యామ్నాయంగా వ్యవసాయశాఖ పంపిణీ చేస్తున్న ఉలవలు, అలసంద, పెసర రైతులు సాగుచేసేలా అధికారులు చొరవ చూపాలి. అప్పుడే వేరుశనగలో జరిగిన నష్టాన్ని కొంతవరకైనా ఇందులో పూడ్చవచ్చు.

– ప్రతాప్‌రెడ్డి, రైతు, ఎం.చెర్లోపల్లి, బత్తలపల్లి మండలం

రైతులకు అవగాహన కల్పించాం



వేరుశనగ పంట దెబ్బతినడంతో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాం. ప్రత్యామ్నాయ విత్తనాలు తీసుకువెళ్లిన రైతుల వివరాలను నమోదు చేసుకున్నాం. వారు పంటలు సాగు చేయకుండా దుర్వినియోగం చేస్తే వాటికి పూర్తి డబ్బులు కట్టించుకుంటాం. అలాంటి వారికి మరోసారి సహకరించం.

– ఓబిరెడ్డి, వ్యవసాయశాఖ అధికారి, బత్తలపల్లి

జిల్లాలో ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపు (క్వింటాళ్లలో)

మండలం	అలసంద	పెసర	ఉలవ	జొన్న
అగళి	100	40	200	00
అమడగూరు	00	80	150	00
అమరాపురం	00	00	500	00
బత్తలపల్లి	120	300	380	00
బుక్కపట్నం	00	00	680	00
చెన్నేకొత్తపల్లి	120	230	1000	00
చిలమత్తూరు	00	00	400	00
ధర్మవరం	120	259	1100	00
గాండ్లపెంట	00	00	460	00
గుడిబండ	00	00	460	00
కదిరి	00	00	500	00
కనగానపల్లి	30	170	600	120
కొత్తచెరువు	00	00	750	00
లేపాక్షి	00	00	270	00
మడకశిర	00	00	470	00
ముదిగుబ్బ	00	500	1200	00
ఎన్‌పీకుంట	00	00	600	00
నల్లచెరువు	00	00	500	00
నల్లమాడ	00	00	780	00
ఓడీ చెరువు	00	00	900	00
పరిగి	00	00	290	00
పెనుకొండ	00	00	280	00
పుట్టపర్తి	00	00	81	00
రామగిరి	50	350	460	00
రొద్దం	00	00	190	00
రొళ్ల	00	00	90	00
సోమందేపల్లి	160	00	380	00
తాడిమర్రి	20	170	550	105
తలుపుల	00	00	500	00
తనకల్లు	00	00	500	00
మొత్తం	720	2099	1522	1225

వైఎస్ జగన్‌తో భేటీ



మాజీ సీఎం వైఎస్ జగన్‌తో మాట్లాడుతున్న దశరథ నాయుడు

నల్లచెరువు: తాడేపల్లిలోని క్యాంప్ కార్యాలయంలో గురువారం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను రాష్ట్ర పాలఏకరి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ దశరథ నాయుడు మర్యాద పూర్వకంగా కలిశారు. కదిరి నియోజకర్గంలో ప్రస్తుత రాజకీయాలపై వైఎస్ జగన్ ఆరా తీశారు. నియోజకవర్గం స్థితిగతులపై వైఎస్ జగన్‌కు వివరించినట్లు దశరథ నాయుడు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



ఏపీ మోడల్ స్కూల్‌లో వంటను పరిశీలిస్తున్న సీహెచ్‌ఓ రామచంద్రారెడ్డి

నల్లచెరువు: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సీహెచ్ఓ రామచంద్రారెడ్డి విద్యార్థులకు సూచించారు. దేవిరెడ్డిపల్లి వద్దనున్న ఏపీ మోడల్ స్కూల్, కళాశాలలో గురువారం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనం ముందు తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. రాత్రిపూట తప్పనిసరిగా దోమతెరలు వాడాలన్నారు. అనంతరం పాఠశాలలోని వంట గదిని వైద్య ఆరోగ్య సిబ్బంది సందర్శించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ హరిత, హెల్త్ అసిస్టెంట్ సూర్యనారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, ఏఎన్ఎం భాగ్యమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సస్యరక్షణతో అధిక దిగుబడులు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

పుట్టపర్తి: ప్రస్తుత సీజన్‌లో సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటల్లో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు వస్తాయని ఏరువాక కో–ఆర్డినేటర్ రామసుబ్బయ్య, ఏఓ సతీష్, ఏఈఓ సునీత సూచించారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా గురువారం బుక్కపట్నం మండలం నార్సింపల్లి తండాలో వరి, మొక్కజొన్న పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం మొక్కజొన్నకు టార్సికం బ్లయిట్ అనే వ్యాధి సోకిందని తెలిపారు. దీని నివారణకు లీటర్ నీటికి 2 గ్రాముల మ్యాంకోజిబ్ మందు కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న చిన్నూరు గ్రామస్తులు

ధర్మవరం: పట్టణంలోని చిన్నూరు గ్రామంలో ఐకమత్యంగా వినాయక చవితి వేడుకలు జరుపుకున్నారు. గ్రామంలో ఐదు రోజులుగా వినాయకుడిని కొలువుదీర్చి ప్రత్యేక పూజలు చేశారు. గురువారం రాత్రి గ్రామస్తులందరికీ అన్నదానం చేశారు. అనంతరం వినాయకుడిని వాహనంలో కొలువుదీర్చి ఊరేగించారు. చెరువులో నిమజ్జనం చేశారు.

రేపు మహిళా ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు

కదిరి అర్బన్: స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 14న జరిగే మహిళా ఉపాధ్యాయుల క్రీడా పోటీలను విజయవంతం చేయాలని ఆ సంఘం ఉపాధ్యాయులు మానస, అనిత వనజ పిలుపునిచ్చారు. గురువారం సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. యూటీఎఫ్ స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని షటిల్, షాట్‌పుట్, త్రోబాల్, స్పీడ్ వాక్, టెన్నికాయిట్ పోటీలు నిర్వహిస్తామన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



గాండ్లపెంట: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

తనకల్లు: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి అన్నారు. మండలంలోని ఎర్రచెరువుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అన్ని పోషక విలువలు ఉన్న సమతుల్య ఆహారం పిల్లలకు అందించగలిగితే వారిలో పౌష్టికాహార లోపాన్ని నివరించవచ్చన్నారు. కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, చిరుధాన్యాలను ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. ఆరు నెలల నుంచి మూడేళ్లు నిండిన చిన్నారులకు బాలామృతాన్ని సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు. అలాగే కిషోర బాలికలు, గర్భవతులు, బాలింతలకు పోషణ విలువలతో కూడిన ఆహారాన్ని అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కేంద్రంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసులు, సూర్యనారాయణ, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పౌష్టికాహార ప్రదర్శన

గాండ్లపెంట: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని నల్లచెరువు ప్రాజెక్టు సీడీపీఓ గంగరత్నమ్మ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార మాసోత్సవాలు నిర్వహించారు. తొలుత వివిధ రకాల పౌష్టికాహార ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పౌష్టికాహారంతో రక్తహీనతను నివారించవచ్చన్నారు. రక్తహీనత నివారణకు మహిళా శిశు సంక్షేమ శాఖ ఎంతో కృషి చేస్తోందన్నారు. బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలు పట్టాలన్నారు. స్థానికంగా లభించే ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు తీసుకున్నట్లయితే కిశోర బాలికల్లో రక్తహీనత నివారించవచ్చని పేర్కొన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించి పౌష్టికాహార విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు పద్మావతి, రఫీమున్నీసా, జయమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు లక్ష్మీదేవి, సుజాత, భారతి, పలు అంగన్‌వాడీ కేంద్రాల కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతారాం ఏచూరికి నివాళి



సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

ఓడీచెరువు: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. స్థానిక సీపీఎం నాయకులు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం సీనియర్ నాయకులు వీవీ రమణ, శ్రీరాములు, కుళ్లాయప్ప, నరసింహులు, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడిని కోల్పోయాం..

కదిరి టౌన్: ప్రజా పోరాట యోధుడిని కోల్పోయామని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.వేమయ్య యాదవ్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని పేర్కొన్నారు.

పుట్టపర్తి టౌన్: స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పించారు. సీనియర్ కామ్రేడ్ నర్సింగ్‌రావ్, సీపీఎం కార్యవర్గ సభ్యులు రాంభూపాల్, పార్టీ సీనియర్ నాయకులు ఓబులు తదితరులు పార్టీకి ఏచూరి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఈఎస్ వెంకటేష్, కమిటీ సభ్యులు నరసింహులు, లక్ష్మీనారాయణ, దిల్షాద్, శ్రీనివాసులు, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగిన ‘సత్యసాయి’ కార్మికుల సమ్మె



తాడిమర్రిలో నిరవధిక సమ్మెలో పాల్గొన్న కార్మికులు

తాడిమర్రి: తమ సమస్యలు తీర్చాలని కోరతూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు గురువారం 22వ రోజూ సమ్మె కొనసాగించారు. స్థానిక మద్దులచెర్వు తాగునీటి సంపు వద్ద బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరారు. నాయకులు ఎం.సతీష్, కే.పెద్దఓబిలేసు, పీ.తిరుపాల్, కే.చిన్న ఓబిలేసు, ఎ.నాగార్జున, ఓబిరెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

బత్తలపల్లి: డిమాండ్ల సాధన కోసం సత్యసాయి కార్మికులు చేపట్టిన సమ్మె 22వ రోజుకు చేరుకుంది. గురువారం మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు కార్మికులు మాట్లాడుతూ ఉద్యోగ భద్రతను కల్పించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి, శంకరయ్య, బాషా, షేక్ మహబూబ్‌బాషా, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, సద్గురు, నరసింహులు, కేశవ, సిద్దయ్య పాల్గొన్నారు.

ముదిగుబ్బ: రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి అనంతపురం జిల్లాలోని సత్యసాయి కార్మికులకు రూ.30 కోట్లు నిధులు మంజూరు చేశారని ఉన్నతాధికారులు చెబుతున్నారు. అయితే అది ఏ విధంగా ఇస్తారు? ఎంత ఇస్తారు అనే దానిపై విధి విధానాలు ప్రకటించాలని సత్యసాయి కార్మికులు డిమాండ్ చేశారు. కార్మికులకు వర్తింపజేయాల్సిన ఈఎస్ఐ, ఈపీఎఫ్, తదితర వాటిపై స్పష్టత లేదన్నారు. ప్రభుత్వం నుంచి స్పష్టత వచ్చే వరకు సమ్మె కొనసాగిస్తామని పేర్కొన్నారు.

సబ్సిడీపై ఉలవల పంపిణీ



సబ్సిడీ ఉలవలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకటప్రసాద్

కదిరి అర్బన్: కుమ్మరవాండ్లపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో పంపిణీ చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఏడీఏ సత్యనారాయణ, ఏఓ శ్రీనివాసరెడ్డి, రైతు భరోసా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌పీకుంట: ఎన్.పీ.కుంట–1, 2 రైతుసేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు వ్యవసాయ అధికారులు గురువారం ఉలవలను పంపిణీ చేశారు. మండలానికి 400 క్వింటాళ్ల ఉలవలు మంజూరయ్యాయని తెలిపారు. సర్పంచ్ ఆంజినమ్మ, ఏఓ లోకేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

గాండ్లపెంట/తలుపుల/నల్లచెరువు: రైతు సేవా కేంద్రాల్లో గురువారం 80 శాతం సబ్సిడీపై 10 కిలోల ఉలవలు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఓ లక్ష్మీప్రియ, ఏఓ షాదాబ్, ఏఓ భారతి ఎంపీడీఓ కిరణ్‌మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

తనకల్లు: మండలంలోని బొమ్మలకుంట సమీపంలోని జాతీయ రహదారిపై గురువారం బైక్ అదుపు తప్పిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు.. బత్తినవారిపల్లికి చెందిన వెంకటరెడ్డి, బైరెడ్డి కొక్కంటిక్రాస్ వైపు నుంచి స్వగ్రామానికి బైక్‌లో బయలుదేరారు. అయితే గ్రామం వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కింద పడ్డారు. ఈ ప్రమాదంలో వెంకటరెడ్డి తలకు, బైరెడ్డి ముఖానికి బలమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వందేమాతరం టీం సభ్యులు తమ ఉచిత అంబులెన్స్‌లో క్షతగాత్రులను చికిత్స కోసం తనకల్లు ఆసుపత్రికి తరలించారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

ధర్మవరం రూరల్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఎస్‌జీఎఫ్ఐ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, యోగా, చెస్, బ్యాడ్మింటన్ తదితర పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో మండల స్థాయి జట్టును ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ గోపాల్ నాయక్, మండల కో–ఆర్డినేటర్ రఘునాథరావు, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత, పీడీ నాగేంద్ర పాల్గొన్నారు.

నల్లమాడ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం బాలురకు ఆటల పోటీలు నిర్వహించారు. పరుగు పందెం, వాలీబాల్, కబడ్డీ, షాట్‌పుట్ పోటీలు నిర్వహించారు. అండర్–14 వాలీబాల్ క్రీడలో న్యూ బాలాజీ ప్రైవేట్ పాఠశాల బాలుర జట్టు విజేతగా.. రెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచింది. ఇదే విభాగం కబడ్డీలో న్యూ బాలాజీ పాఠశాల జట్టుపై ఎస్టీ ఆశ్రమ పాఠశాల బాలుర జట్టు విజయం సాధించింది. ఇదే విభాగం 100 మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్‌లో ఆశ్రమ పాఠశాల విద్యార్థి కె.భాస్కర్, నల్లమాడ హైస్కూల్ విద్యార్థి ఆర్.సాయికుమార్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. అండర్–17 వాలీబాల్‌లో రెడ్డిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల జట్టు విజేతగా.. ఎస్టీ ఆశ్రమ పాఠశాల జట్టు రన్నర్‌గా నిలిచింది. 100 మీటర్ల పరుగు పందెంలో న్యూ బాలాజీ పాఠశాల విద్యార్థి ఎం.రంజిత్, దొన్నికోట హైస్కూల్ విద్యార్థి టి.నరసింహులు, షాట్‌పుట్‌లో రెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థి విష్ణు, దొన్నికోట విద్యార్థి టి.నరసింహులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారు. హెచ్ఎం భాస్కర్‌రెడ్డి, పీడీలు, పీఈటీలు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్యపై భర్త దాడి



చికిత్స పొందుతున్న పద్మావతి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన చేనేత కార్మికుడు మల్లికార్జున గురువారం భార్య పద్మావతిపై కట్టెతో దాడి చేశాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. శాంతినగర్‌కు చెందిన మల్లికార్జున మద్యం తాగి ఇంటికి వచ్చి భార్య పద్మావతితో గొడవపడ్డాడు. ఇంటిలో పని చేయలేదని కట్టెతో ఆమె తలపై కొట్టాడు. ఈ దాడిలో పద్మావతి తలకు తీవ్రగాయమైంది. స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం రూరల్: మండల పరిధిలోని రేగాటిపల్లి గ్రామానికి చెందిన షెక్షావలి అనే వ్యక్తి గురువారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించారు. కుటుంబ కలహాలతోనే ఆత్మహత్యాయత్నం చేసినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.